క్లుప్తంగా

క్రీడా పరికరాలు సిద్ధం



మండల పరిషత్ కార్యాలయంలో క్రీడా పరికరాలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాధిక

పూసపాటిరేగ: మండలంలో జరగబోయే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి క్రీడా పరికరాలు సిద్ధం చేశామని ఎంపీడీఓ ఎం.రాధిక మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని 22 సచివాలయాల పరిధిలో ఇప్పటి వరకు 600 మంది వరకు క్రీడాకారులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని పేర్కొన్నారు. మరో వారం రోజుల్లో రిజిస్ట్రేషన్లు పూర్తవుతాయని తెలిపారు. ఆమెతో పాటు మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ రవికుమార్ వున్నారు.

ఉచితంగా బ్రెయిన్ సర్జరీ



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరామ్మూర్తి

విజయనగరం ఫోర్ట్: సాయి ఆస్పత్రిలో విజయవంతంగా బ్రెయిన్ సర్జరీని వైద్యులు చేశారు. ఈ మేరకు డాక్టర్ శ్రీరామ్మూర్తి వివరాలు వెల్లడించారు. చీపురుపల్లి మండలం వంగపల్లిపేటకు చెందిన రమేష్ అనే యువకుడికి తలలో రక్తం గడ్డం కట్టడంతో వారి బంధువులు విజయనగరంలోని సాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేర్పించారు. అతనికి విశాఖ కేజీహెచ్ డాక్టర్ నాయక్ సాయి ఆస్పత్రిలో విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించారు. ఆస్పత్రిలో చేరే సమయంలో అతను కోమా లో ఉన్నాడని, శస్త్రచికిత్స తర్వాత అతను కోలుకున్నాడని చెప్పారు. రూ.3 లక్షల వరకు ఈ శస్త్రచికిత్సకు ఖర్చువుతుందని, సాయి ట్రస్టు ద్వారా ఉచితంగా చేశామని తెలిపారు. సమావేశంలో డాక్టర్ నాయక్, అక్కెన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వనిత వాకర్స్ క్లబ్‌కు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకుంటున్న క్లబ్ ప్రతినిధులు

విజయనగరం: పట్టణానికి చెందిన వనిత వాకర్స్ క్లబ్, ఫోర్టు శాఖకు ఉత్తమ క్లబ్ అవార్డు లభించింది. ఈ మేరకు వాకర్స్ డిప్యూటీ గవర్నర్ ముళ్ళపూడి సుభద్ర దేవి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయం తెలిపారు. క్లబ్ అధ్యక్షురాలు సాయి సంతోషిణి ఉత్తమ యువ అధ్యక్షురాలుగా అవార్డు అందుకున్నారని తెలిపారు. ఈ అవార్డును సోమవారం జరిగిన వాకర్స్ డిస్ట్రిక్ సర్వసభ్య సమావేశంలో గవర్నర్ సత్యం చేతుల మీదుగా అందుకున్నట్టు పేర్కొన్నారు. వనిత వాకర్స్ క్లబ్‌కు ఉత్తమ క్లబ్ అవార్డు లభించడం పట్ల పట్టణంలోని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీ చిన్నారులకు బ్యాగుల వితరణ



బ్యాగులు పంపిణీ చేస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు

మెంటాడ(గజపతినగరం రూరల్): మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గజపతినగ రానికి చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బ్యాగులు, కుర్చీలు, వాటర్‌బాటిళ్లు పంపిణీ చేశారు. ఆ ఫౌండేషన్ అధ్యక్షుడు సాయికుమార్, సభ్యులు తాతినాయుడు, రాము నాయుడు, ఆశిక్, మహిళా పోలీస్ రేణుక, అంగన్‌వాడీ సహాయకురాలు రాధ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవం



జ్యోతిరావు పూలే దంపతుల జీవిత చరిత్రను విద్యార్థులకు వివరిస్తున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌పాత్రో

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామ సమీపంలోని జ్యోతిరావుపూలే బాలికల ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ యు.విజయ్‌కుమార్‌పాత్రో, ఉపాధ్యాయి సిబ్బంది జ్యోతిరావు పూలే, ఆయన భార్య సావిత్రీబాయి పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతిరావుపూలే జీవిత చరిత్రను విద్యార్థులకు ప్రిన్సిపాల్ వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖ నం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

మిచాంగ్ ఎఫెక్ట్

- రెండో రోజూ జోరు తగ్గని వర్షం
- ప్రభుత్వ ఆదేశాలతో మూత పడిన పాఠశాలలు
- జిల్లా కేంద్రంలో అవస్థలు పడ్డ చిరు వ్యాపారులు
- ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించిన కార్పొరేషన్ యంత్రాంగం



రైళ్ల రద్దుతో ప్రయాణికులు లేక వెలవెలబోతున్న విజయనగరం రైల్వేస్టేషన్



కార్పొరేషన్ ఆధ్వర్యంలో కాలువల్లో చెత్త తొలగింపు

విజయనగరం: మిచాంగ్ తుఫాన్ ప్రభావం రెండవ రోజు మంగళవారం జిల్లా కేంద్రంపై ప్రభావం చూపించింది. సోమవారం నుంచి ప్రారంభమైన తుఫాన్ అలజడి మంగళవారం కూడా కొనసాగింది. ఎటువంటి ఈదురుగాలులు ప్రభావం లేకున్నా రోజంతా వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. వాతావరణ శాఖ ముందుస్తు హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పాఠశాలలు మూతపడ్డాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నియోజకవర్గం పరిధిలోని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో దెబ్బతిన్న వరి పంటను ఎంపీపీ మామిడి అప్పలనాయుడు పరిశీలించారు. మరో వైపు వాణిజ్య కేంద్రంగా పేరుగాంచిన విజయనగరంలో వ్యాపార లావాదేవీలు స్తంభించిపోయాయి. చిరు వ్యాపారులు వర్షంలో వ్యాపారాలు సాగించి అవస్థలు పడ్డారు. భారీ వర్షాలతో పలు రైళ్లు రద్దు కావటంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లా యంత్రాంగం నివేదిక ప్రకారం సోమవారం నుంచి మంగళవారం ఉదయం 8 గంటల వరకు విజయనగరం నియోజకవర్గంలో 28.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో భారీ నుంచి అతి భారీ వర్షాల నేపథ్యంలో విజయనగరం మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కోవటంలో భాగంగా ఉద్యోగులకు సెలవులు రద్దు చేశారు. నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో ముందుస్తు చర్యలు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్త, చెదారాలను తొలగించారు. శివారు ప్రాంతాల్లో ఎటువంటి ముంపు సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

వరి పొలాల పరిశీలన



మంజేరులోని వరి పొలాలను పరిశీలిస్తున్న ఏఓ హరికృష్ణ

భోగాపురం: మండలంలోని ముంజేరు గ్రామంలో రైతులు సాగు చేస్తున్న వరి పొలాలను మండల వ్యవసాయాధికారి వి.హరికృష్ణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 1600 ఎకరాల విస్తీర్ణంలో రైతులు వరి సాగు చేస్తున్నారన్నారు. 800 ఎకరాల్లోని వరి పంటను కోసి కుప్పలు పెట్టడం వలన పంట నష్టం జరగలేదని తెలిపారు. రానున్న 48 గంటల్లో ఒక మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉన్నందున రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలో ఎక్కడైన ఎక్కువ పంట నష్టం జరిగితే వెంటనే సంబంధిత రైతుభరోసా కేంద్రాలకు సమాచారం అందించాలని సూచించారు.

సముద్రతీర ప్రాంతాల సందర్శన



మత్స్యకారులకు సూచనలిస్తున్న తహసీల్దార్ బంగార్రాజు, ఎంపీడీఓ అప్పలనాయుడు

భోగాపురం: మండలంలోని సముద్రతీర ప్రాంతలైన ముక్కాం, కొండ్రాజుపాలెం, చేపలకంచేరు గ్రామాలను మంగళవారం తహసీల్దార్ చింత బంగార్రాజు, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు సందర్శించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వలన సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, వలలు, బోట్లు, మర పడవలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, వాసుపల్లి రేయ్యుడు, ఏపీఓ ఆదిబాబు, ఏపీఎం రమణ, మత్స్యకారులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములపై పేదలకు సంపూర్ణ హక్కు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



నిరుపేదలకు సంపూర్ణ భూహక్కు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు

పూసపాటిరేగ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలకు అసైన్డ్ భూములుపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ పట్టాలు మంజూరు చేయడం దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రోల్‌మోడల్‌గా చెప్పవచ్చునని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సంపూర్ణ భూహక్కు పథకంలో భాగంగా 16 గ్రామాలకు చెందిన 363 మంది లబ్ధిదారులకు 198.23 సెంట్లు భూమికి సంబంధించి పట్టాలు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు శాశ్వత భూ యాజమాన్య హక్కు పత్రాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేత నిర్ణయంతో నిరుపేద రైతులకు భూహక్కు పత్రాలతో ఎంతో మేలు జరగడంతో పాటు ఆయా కుటుంబాలు కష్టాలు తీరుతాయన్నారు. గతంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి నిరుపేద రైతులకు డీ పట్టాలు మంజూరు చేస్తే నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ భూములుపై సర్వహక్కులు కల్పిస్తూ పట్టాలు అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎస్.సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్ధనరావు, బర్రి చినఅప్పన్న, మొంగం నాగబాబు, గుజ్జు సురేస్‌రెడ్డి, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ఎంపీడీఓ ఎం.రాధిక, డిప్యూటీ తహసీల్దార్ పి.లావణ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



పంచాయతీ కార్యదర్శులకు ఆడుదాం ఆంధ్రా క్రీడా పరికరాలను అందజేస్తున్న సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: క్రీడలతోనే యువతీ, యువకులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో మండలంలోని 16 సచివాలయాలకు ప్రభుత్వం మంజూరు చేసిన క్రీడా పరికరాలను పంచాయితీ కార్యదర్శులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ క్రీడల్లో ప్రావీణ్యం ఉన్న యువతీ, యువకులను పైకి తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. 18 సంవత్సరాలు నిండిన పల్లె గ్రామాల్లోని యువతీ, యువకులందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



మాట్లాడుతున్న భూసార పరీక్ష కేంద్రం ఎ.డి. భానులత

పూసపాటిరేగ(నెల్లిమర్ల) : రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి భూసారాన్ని పెంపొందించుకోవాలని భూసార పరీక్ష కేంద్రం సహాయ సంచాలకులు బి.భానులత అన్నారు. మండలంలోని సీతారామునిపేటలో ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా రైతులకు అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులు విచక్షణా రహితంగా వాడకం చేయడం వలన భూమి సారం ఏవిధంగా కోల్పోతుందో అవగాహన కల్పించారు. పంట దిగుబడి తగ్గడం, చీడపీడలకు ఎలా కారణభూతమవుతున్నాయో వివరించారు. భూసార పరీక్షల వలన ఉపయోగాలు, సేంద్రియ ఎరువులు వాడకం, పచ్చిరొట్ట ఎరువులు వాడకం వలన ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం ఏఓ ఎం.సింహాచలం, విస్తరణాధికారి జగన్నాధరావు, వ్యవసాయ శాఖ సహాయకులు శ్యాం కుమార్, యాదవ్‌తో పాటు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి



లబ్ధిదారునికి బుక్‌లెట్ అందజేస్తున్న అప్పలనాయుడు తదితరులు

పూసపాటిరేగ : రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో ఉందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.అప్పలనాయుడు అన్నారు. మండలంలో కోనాడ సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. సంక్షేమ బోర్డును ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి ఇంటింటి వెళ్లి లబ్ధి చేకూరిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అమర గురువులు, దాడిశెట్టి త్రినాధరావు, బొడ్డు ఎల్లాజీ, దాడిశెట్టి గోవిందరావు, దారపు లక్ష్మణరెడ్డితో పాటు గ్రామానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

భక్తుల కోసం సిమెంట్ బెంచీల ఏర్పాటు

చీపురుపల్లిరూరల్: మెట్టపల్లి గ్రామంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తుల కోసం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు రాపర్తి గురుమూర్తి తన తండ్రి సత్యం జ్ఞాపకార్థం రూ.30 వేల విలువైన సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. వీటిని ఎంపీటీసీ మీసాల ఈశ్వరరావుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. దాతను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో రాపర్తి సూర్యకుమార్, నాగులపల్లి కృష్ణమూర్తి, శివస్వాములు పాల్గొన్నారు.

కొండకరకాంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



గ్రామస్తులతో కేంద్ర బృంద సభ్యులు అనురాధ, అధికారులు

విజయనగరం రూరల్: మండలంలోని కొండకరకాం గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్ర బృంద సభ్యులు సీనియర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.అనూరాధ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం గ్రామ స్థాయిలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. పారిశుద్ధ్యం మెరుగు, తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్లు నిర్మాణం, టీబీ వంటి వ్యాధుల నివారణకు చేస్తున్న కృషిని వివరించారు. కేంద్ర పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులతో మాట్లాడుతూ వాటి ప్రయోజనాలను వివరించారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, డీటీఈఓ డాక్టర్ రాణి, డీఎంఓ తులసి, ఎంపీడీఓ గంటా వెంకటరావు, గ్రామ సర్పంచ్ కె.రమ్య, ఎంపీటీసీ సభ్యురాలు బి.ఈశ్వరమ్మ, రాకోడు పీహెచ్‌సీ వైద్యురాలు శ్రావణి, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం



బియ్యాలపేటలో వరి పంటను పరిశీలిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని బియ్యాలపేట, మలిచర్ల గ్రామ సచివాలయ పరిధిలోని వరి పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బియ్యాలపేటలో తుఫాన్ ప్రభావంతో గ్రామానికి చెందిన రైతులు ఎద్దుమట్టి అప్పన్న, నారంశెట్టి బంగారయ్య పొలాల్లో తడిసిన వరి కుప్పలు, వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతులకు అండగా ఉంటారని, రెండు మూడు రోజుల్లో వ్యవసాయాధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి నివేదిక అందిస్తారన్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు సహాయానికి ఫోన్‌లో సమాచారం అందించాలన్నారు. సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శించి సమాచారం అందించాలన్నారు.

10న నాగవంశీయుల కార్తీక సమారాధన



నాగవంశీయుల వన సమారాధన కరపత్రాల ఆవిష్కరణ

విజయనగరం: నాగవంశ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 10న రామనారాయణం పుణ్యక్షేత్రాన్ని ఆనుకుని ఉన్న తోటలో నిర్వహించే నాగవంశీయుల కార్తీక సమారాధనను విజయవంతం చేయాలని సంఘం అధ్యక్షుడు అవనాపు విక్రమ్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి అవనాపు విక్రమ్ పిలుపునిచ్చారు. నగరంలోని సంఘ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సమారాధనలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. అరకుకు చెందిన కళాకారులతో గిరిజన సంప్రదాయ నృత్యం (దింశా డ్యాన్స్), నాగవంశానికి చెందిన సినీ, టీవీ కళాకారులు బుగత సత్యనారాయణ టీమ్‌తో హాస్య వల్లరి వంటి వినోదాత్మక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన నాగవంశీయ విద్యార్థులకు పికినిక్‌లో ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. సమావేశంలో కాళ్ల గౌరి శంకర్, గాడు అప్పారావు, కనకల కృష్ణ, గాడు వెంకట భానోజీరావు, రామసింగు ప్రసాదరావు, పోలుబోతు మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సుధారాణి

భోగాపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో కన్వర్జెన్సీ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి సుధారాణి మండల స్థాయి అధికారులను అదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు నిర్మిస్తున్న గృహ నిర్మాణాలపై వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న పనులు, జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు చేపడుతున్న గృహ నిర్మాణాలపై ఆరా తీశారు. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న సచివాలయ, రైతుభరోసా, వెల్‌నెస్, అంగన్‌వాడీ భవన నిర్మాణాలను త్వరిగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరైనా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణంతో పాటు మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, హౌసింగ్ పీడీ వి.శ్రీనివాసరావు, డీఈ ఎం.సత్యనారాయణ, తహసీల్దార్ చింత బంగార్రాజు, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, హౌసింగ్ ఏఈ రాజేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

